# దిష్టిబొమ్మ

కొండా కుసుమకుమారి

చైత్ర మాసపు తొలి రోజులు.

అపరాహ్ణం కాకపోయినా ఎండ తీక్ష్ణతను సంతరించుకొంటూంది.

కూలీలు చెమట కక్కుతూ పనుల్లో మునిగిపోయారు. వాళ్ళను అజమాయిషీ చేస్తూ మేస్త్రీ మధ్య మధ్య కేకలు పెడుతున్నాడు.

తన కలల పంట అయిన ఆ కొత్త ఇంటి నిర్మాణాన్ని దగ్గరుండి స్వయంగా పర్యవేక్షిస్తున్నాడు సంజీవరావు. ఇంటి పనివల్ల నెల రోజులు ఆఫీసుకు సెలవు పెట్టాడు అతను. రాత్రీ, పగలూ తీరిక లేకుండా అన్నీ తనే చూసుకొంటున్నాడు.

తమ్ముళ్ళకు, మరదళ్ళకు అన్ని సౌకర్యాలతో, అందంగా కట్టించాలన్నదే అతని తపన.

ప్యూన్ ఆఫీసు కొచ్చిన లెటర్సు తీసుకొచ్చాడు. ఆఫీసుకు సంబంధించిన కవర్లు, ఇన్సూరెన్స్ కాగితాలు, ఇంకేవో రిసీట్స్ కాక ఓ కవ రుంది.

ముత్యాలకోవ లాంటి దస్తూరి ఎవరిదో చప్పున పోల్చుకోలేకపోయాడు. ఓపెన్ చేసి గులాబీ రంగు కాగితం బయటకు తీశాడు.

"సంజూ !"

తుళ్ళిపడ్డాడు ఆ సంబోధనకు. తన నలా పిలిచే వ్యక్తి ఒక్కరే. తన జీవితం మొత్తం కాలంలో ఆమె ఒక దివ్య జ్ఞాపిక.

"నాకు విజయవాడకు ట్రాన్స్‌ఫర్ అయింది. ను వ్విప్పుడు అక్కడే ఉన్నావని తెలిసి నీ కీ లెటరు రాస్తున్నాను. సోమవారం హౌరా కొస్తున్నాను. స్టేషనుకు రాగలవు.

రాజేశ్వరి."

చూపు మసకబారినట్లు కళ్ళు నులుముకొని మళ్ళీ మళ్ళీ చదివాడు. చదివే కొద్దీ ఏదో ఎక్సైట్‌మెంట్. తట్టుకోలేని, తమాయించుకోలేని స్థితి.

హృదయంలో సంచలనాన్ని అణుచుకొనే ప్రయత్నంగా అటూ ఇటూ తిరిగాడు. మధ్య మధ్య ఆగి మళ్ళీ చదువుకొన్నాడు.

'రాజేశ్వరి' అన్న నాలు గక్షరాలూ హార్మోనీరీడ్స్ మీద పలికే సప్తస్వరాల సంగీతంలా "రా... జే... శ్వ... రీ... ఈ..." అంటూ చెవిలో ప్రతిధ్వనిస్తుంది.

విశ్వమంతా ఆ రాగమే వినిపిస్తున్న భావన.

'రాజేశ్వరి... రాజేశ్వరి' పదే పదే పలవరిస్తున్నాయి పెదవులు.

కూలీలకు అతని వాలకం కొద్దిగా ఆశ్చర్యం కలిగించినా పని హడావిడిలో అంతగా పట్టించుకోలేదు.

ఒక్కొక్క రాయి చొప్పున పేర్చుతూ కట్టుకొన్న భవంతిలా ఒక్కొక్క అనుభూతితో మనసులో నిర్మించుకున్న ప్రేమమందిరంలో ప్రతిష్ఠించుకొన్న దేవత రాజేశ్వరి.

తండ్రి ఉన్న రోజుల్లో బందరులో ఇరుగు పొరుగు ఇళ్ళలో ఉండేవారు తామూ, రాజేశ్వరి వాళ్ళూ.

ఊహ తెలిసినప్పటి నుండి అల్లుకొన్న బంధం తమది. ప్రతి చూపూ, ప్రతి పలుకూ అనుభూతుల తరంగాల్ని రేపిన వయసు. రాజేశ్వరే తను, తనే రాజేశ్వరి అనుకొని ఒకటిగా తిరిగిన రోజులు.

ఆ రాజేశ్వరి ఇన్నాళ్ళకి ఇప్పుడు మళ్ళీ తనని కలవబోతుందా ! మనసులో ఏదో సంభ్రమం.

చెంగు చెంగున ఎగురుతూ "పెదనాన్నా ! అమ్మ భోజనానికి రమ్మంటూంది" అంటూ వచ్చింది బుజ్జి.

"ఆకలి లేదమ్మా. కొంచెం ఆగి తింటానని చెప్పు" అనబోయి విరమించుకున్నాడు.

తను భోజనం చెయ్యకపోతే మరదళ్ళూ తినరు, ఎదురుచూస్తూ కూర్చుంటారు తప్ప.

మేస్త్రీకి చెప్పి బుజ్జితో కడుతున్న కొత్త ఇంటికి ఎదురుగా ఉన్న నివాస గృహానికి బయలుదేరాడు.

"అక్క పెళ్ళి ఈ కొత్త ఇరిట్లోనే చేస్తారు కదూ?" కళ్ళు తిప్పుతూ అడుగుతుంటే "అక్కకే కాదమ్మా ! మీ అందరి పెళ్ళిళ్ళూ ఇక్కడే జరుగుతాయి" అన్నాడు నవ్వుతూ.

లలిత డైనింగ్ టేబుల్ మీద అన్నీ అమర్చి అక్కడే నిలబడింది.

"నేను వడ్డించుకొంటాను కదమ్మా. నీ కేదైనా పని ఉంటే చూసుకో" అన్నాడు సింక్ దగ్గర చేతులు కడుక్కొని వచ్చి కూర్చుంటూ.

"ఇప్పు డేం పనండీ?" అంటూ అతడికి కొసరి కొసరి వడ్డించి కాని ఊరుకోలేదు.

చిన్న తమ్ముడి కొడుకు కిరణ్ అన్నం తింటున్నంతసేపూ కబుర్లు చెబుతూ ఒళ్ళోనే కూర్చుంటాడు రోజూ.

వాసంతి వాడిని తీసుకోబోతుంటే వారించాడు- "ఉండనీ. వాడి కబుర్లు వింటూ తినకపోతే నాకు కడుపు నిండదు" అంటూ.

"సుగంధ కాలేజీకి వెళ్ళిందా?" భోజనం చేశాక చెయ్యి తుడుచుకొంటూ అడిగాడు.

"అవునండీ !"

"పరీక్ష ఫీజు కట్టాలంది. మధ్యాహ్నం వచ్చినప్పుడు ఇవ్వమ్మా !" అంటూ బీరువాలో నుంచి డబ్బు తీసి లలిత కిచ్చాడు. అలాగే మరో రెండొందలు తీసి వాసంతి కిస్తూ - "బుజ్జి పుట్టిన రోజొస్తుంది. మంచి బట్టలు తీసుకోమ్మా" అన్నాడు.

షర్టు తొడుక్కొని ఇంటివైపు వెళ్ళబోతుంటే "మధ్యాహ్నం కొంచెంసేపు విశ్రాంతి తీసుకోకుండా వెళతా రేం? మేస్త్రీ ఉన్నాడు కదా. మీ తమ్ముళ్ళను సెలవు పెట్టమంటే పెద్ద తమ్ముడు ఇన్‌స్పెక్షన్ అంటూ, చిన్న తమ్ముడు పరీక్షలు దగ్గర పడ్డాయంటూ తప్పించుకొన్నారు. క్షణం విశ్రాంతి తీసుకోకుండా భారం అంతా మీ మీదే పడింది" అంది బాధపడుతూ లలిత.



ఫోటో : బి. ప్రభాకర్ [హైదరాబాద్]

నంజీవరావు నవ్వుతూ "వాళ్ళకేం తెలుననీ ఈ పనులు? మేస్త్రీ చెప్పినట్లు వినడం తప్ప పనితీరు పరిశీలించే పరిజ్ఞానం ఎక్కడుంది వాళ్ళకు? అయినా నే నున్నాను కదా" అంటూ వెంటబడుతున్న కిరణ్‌ను వానంతి కిచ్చి బయటకు నడిచాడు.

నంజీవరావుకు తముళ్ళను, మరదళ్ళను చూస్తుంటే ఎంతో ముచ్చటగా అనిపిస్తుంది.

బుద్ధిమంతులైన తమ్ముళ్ళు, వాళ్ళకు అనుకూలమైన భార్యలు, ముచ్చటైన పిల్లలు ! విరబూసి మల్లెపందిరి లాంటివి వాళ్ళ కాపురాలు.

తను కోరుకొన్నదీ అదే.

** ** **

పశ్చిమాద్రి సిందూరం విరజిమ్ముతుంది. అప్పుడే మాలి మొక్కలకు నీళ్ళు పోశాడేమో చల్లని గాలి వీస్తోంది.

విచ్చిన పూలసౌరభం నలుదిక్కులా వ్యాపిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పుతూంది.

బుజ్జి, చిన్ని బంతి ఆడుకొంటున్నారు.

ఫౌంటెన్‌కు సమీపంలో కూర్చున్న నంజీవరావు కిరణ్‌తో ఆడుకొంటూ ముద్దు మాటలు చెప్పించుకొన్నాడు కొంతసేపు.

"నేనూ బంతి ఆడుకొంటాను" అంటూ వాడు లేచి వెళ్ళడంతో ఒక్కడూ పరిసరాలను చూస్తూ, పిల్లల ఆటల్ని చూస్తూ కూర్చున్నాడు.

సాయంకాలాలు పిల్లలతో గడపడం అతని కెంతో ఇష్టం. వాళ్ళ ఆటలు చూస్తుంటే మనసంతా సెంతోషపు వెల్లువతో నిండిపోతోంది.

ఎవరో 'నంజూ ! నంజూ !' అంటూ చెవిలో పిలిచి నట్లనిపించడంతో ఉలిక్కిపడ్డాడు.

పిల్లతెమ్మెర కినుక్కున నవ్వినట్లనిపించింది.

రాజేశ్వరి తనని ఉడికిస్తూ విరగబడి నవ్వడం గుర్తొచ్చింది. కొంచెం తల వెనక్కి వాల్చి నవ్వుతుంటే ముత్యాలసరం లాంటి పలువరస తళుక్కుమంటే, చెక్కిలిపై నొక్కులు చిన్నబోయేవి.

శంఖంలా పొడవుగా సాగిన కంఠాన్ని పెదవులతో తాకాలని, నీలిమబ్బుల్లాంటి కురుల్లో ముఖం దాచుకోవాలని ఆల్చిప్పల్లాంటి రెప్పల్ని ముద్దిడుకోవాలని ఎంతగా అనిపించేదో.

ఆ మాటే రాజేశ్వరితో అంటే నవ్వుతూ - "అది తీరని కోరికేం కాదుగా? ఓ పసుపుతాడు తెచ్చి మూడు ముళ్ళూ వేశావంటే మూడు క్షణాల్లో తీరుతుంది" అనేది.


"మన పెళ్ళి అలా క్షణాల్లో జరిగిపోవడం నా కిష్టంలేదు రాజేశ్వరి. పెద్ద కొడుకు వివాహం ఎంతో వైభవంగా చేయాలని మా నాన్న తాతయ్య తెగ అనుకొంటారు. అదీ నీతో అంటే ఎవరికి అభ్యంతరం ఉంటుంది? అమ్మ నిన్ను ముద్దుగా కోడలు పిల్ల అని పిలుచుకోవడం తెలుసుగా?"

"అయితే ఇంకెందుకు ఆలస్యం? మామయ్యకు మన విషయం చెప్పెయ్ !"

"చెప్పొచ్చు. కాని బి.ఎ. అన్నా పూర్తి చెయ్యకుండా ప్రేమలో పడ్డానని చెప్పడానికి సిగ్గుగా ఉంది."

"నాకేం సిగ్గులేదు. ప్రేమకు అర్హత డిగ్రీ కాదుగా? పోనీ నేను చెప్పనా?"

"అప్పుడు ఇంత సిగ్గులేని పిల్లను కోడలుగా చేసుకోవడ మేమిటనుకొంటారేమో?" అని నవ్వేవాడు.



జబ్బుమీద గిచ్చుతూ - "అబ్బ, నీతో పెద్ద చిక్కే బాబూ !" అంటూ బుంగమూతి పెట్టేది.

అతని కెందుకో గతంలోకి చొచ్చుకుపోవాలనిపిస్తూంది.

"పెదనాన్నా అక్క కొట్టింది చూడు" అంటూ కిరణ్ వచ్చి ఒళ్ళో పడటంతో వెనక్కి వచ్చాడు అతి ప్రయత్నం మీద.

శ్లాబ్ వేయడానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఒక పక్క షెడ్లో ఉడెన్ వర్కు సాగుతోంది.

ఎవరి గది వాళ్ళకి కేటాయించి వాళ్ళకు కావలసిన సౌకర్యాలన్నీ అందుబాటులో ఉండేలా కట్టించాలని ఉంది నంజీవరావుకి. వంటిల్లు ఆధునాతన పద్ధతిలో ప్లాన్ చేశాడు- మరదళ్ళు ఇబ్బంది పడకుండా.

పై రెండు గదులూ తనకోసం ఏర్పాటు చేసుకోవాలనుంది. పిల్లలతో ఆడుతూ పాడుతూ ఉండేందుకు అనువుగా ఉంటుందని.

తండ్రి బ్రతికి ఉన్న రోజుల్లో తల్లితో అనేవాడు. "జీవితంలో ఇల్లు కట్టుకోవాలనేది ఒక అపురూపమైన కోరిక. అది తీరకుండానే కన్ను మూస్తానేమో సుందరం."

"ఎందుకలా అనుకొంటారు? ఏదో ఒక రోజు మనం పిల్లలతో స్వంత గృహంలో ఉండకపోము" అని నమ్మకంతో చెప్పేది తల్లి.

ఆ నమ్మకం వమ్ము చేస్తూ తండ్రి పక్షవాతంతో మంచాన పడ్డాడు. కుటుంబ భారం మోసే మూలస్తంభం కూలిపోయి నట్లనిపించింది.

నంజీవరావు తరువాత ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తల్లి వీధి గుమ్మం చూడని మనిషి. ఇంటి పరిస్థితి అస్తవ్యస్తంగా కనిపించింది.

వ్యాధి ముదిరి పరిస్థితి క్షీణించడంతో కేశవయ్య పెద్ద కొడుకు నంజీవరావును మంచంమీద కూర్చోబెట్టుకొని "బాబూ ! రెక్కలు రాని పిల్లల్ని వదిలివెళ్ళిపోతున్నాను. ఇంటికి పెద్ద బిడ్డవి నువ్వు. పసివాళ్ళయిన తమ్ముళ్ళను, చెల్లెళ్ళను నీ కప్పగిస్తున్నాను నాయనా. నామీద కోపం తెచ్చుకోకు" అన్నాడు కళ్ళనీళ్ళతో.

ఏడుపు పొంగుకొస్తుంటే - "మీరు దిగులు పెట్టుకోకండి నాన్నా. తొందరలోనే మీరు కోలుకొని మామూలుగా తిరిగే రోజు వస్తుంది" అంటూ ధైర్యం చెప్పాడు నంజీవరావు.

"నాకు బ్రతకాలనే ఉంది సంజీవా. బాధ్యతలు తీర్చి, పిల్లల్ని ఒక దారికి తెచ్చేవరకూ బతకాలని ఉంది. కాని ఆ ఆశ క్షీణించింది. నా కీ మాట ఇస్తే

ప్రాణం పోయేముందు కొన్ని క్షణాలైనా తృప్తిగా ఉండగలను.''

తండ్రి చేతిలో చెయ్యి వేశాడు. ''నా తమ్ముళ్ళ, చెల్లెళ్ళ బాధ్యతలు నేనుగాక మరెవరు చూస్తారు? వాళ్ళకు, అమ్మకు ఏ లోటూ రాకుండా చూసేపూచీ నాది'' అంటూ.

తండ్రి చనిపోవడంతో గూడు కూలిపోగా దిక్కుతోచని పక్షులే అయ్యారు. కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తున్న తల్లిని, పిల్లల్ని తనే పెద్దదిక్కయి ఓదార్చాడు.


''ను వ్వలా కుమిలిపోతుంటే ...మైపోవాలమ్మా? నువ్వు లేచి మామూలుగా తిరగగలిగితే నిన్ను చూసి ధైర్యం తెచ్చుకొంటాం'' అంటూ తల్లిని మామూలు మనిషిని చేశాడు.

తండ్రి సర్వీసులో ఉండగా పోవడంతో ఆ డిపార్టు మెంటు ఉద్యోగం వచ్చింది సంజీవరావుకు.

ఇంటి భారం మీద పడటంతో అతని దృక్పథం మారిపోయింది. తమ్ముళ్ళను బాగా చదివించి, చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు చేయడమే ధ్యేయం అయింది.

** ** **

''ఇవాళ ఒక స్నేహితురాలు మనింటికి




అతిథిగా రాబోతుంది.'' ఉదయం కాఫీ తాగుతూ చెప్పాడు సంజీవరావు.

''ఎవ రన్నయ్యా?'' కుతూహలంతో అడిగాడు చిన్న తమ్ముడు మురారి.

''నాన్నగారు ఉద్యోగం చేసే రోజుల్లో బందరులో ఉన్నప్పుడు పక్క వాటాలో ఉండేవాళ్ళు- కరెంటు ఆఫీసులో పని చేసే అచ్యుతంగారు. వాళ్ళకూ, మన కుటుంబానికీ పది పన్నెండేళ్ళ స్నేహం ఉంది. వాళ్ళమ్మాయి రాజేశ్వరని నాకు మంచి స్నేహితురాలు. ఇప్పు డేదో ఉద్యోగం చేస్తూ ట్రాన్స్ఫర్‌మీద ఈ ఊరు రాబోతోంది.''

''ఓ వాళ్ళా? నాకు గుర్తుం దన్నయ్యా! ఆ అమ్మ యెప్పుడూ మనింట్లో చనువుగా తిరుగుతూ, అల్లరి చేస్తూమమ్మల్నిఏడిపించేది. సన్నగా, ఎర్రగా ఇంత బారు జడతో చలాగ్గా తిరిగేది.'' మెరుస్తున్న కళ్ళతో గతాన్ని గుర్తుకు తెచ్చు కొంటూ అన్నాడు రఘురాం.

''అవునవును.''

రఘురాం, మురారి చూపు లొక సారి కలుసుకొన్నాయి. అంతలోనే పెదవులపై కనీకనిపించని నవ్వు మెదిలింది.

క్షణం తోడికోడళ్ళిద్దరూ విషయం అర్థంకాక ముఖాలు చూసుకొన్నారు. బావగారిలో ఏదో కొత్త ఉత్సాహం కనిపించడంతో చిన్నగా నవ్వుకొన్నారు.

సంజీవరావు స్టేషను బయలుదేరి వెళ్ళాడు. ట్రెయిన్ టైమయ్యే కొద్దీ ఏదో ఆత్రత, మరేదో తత్తరపాటు.

ఎన్నాళ్ళకు చూడ బోతున్నాడు రాజేశ్వరిని. దాదాపు ఇరవై సంవత్సరాలైంది ఆమెను చూసి అనుకొన్నాడు.

అప్పటికీ ఇప్పటికీ ఎంత మారిందో?

* * * *

''మన పెళ్ళి సంగతి ఏ మాలోచించావు! అంటూ నిలదీసింది ఒక రోజు.

''ఆలోచించేదేముంది రాజేశ్వరీ? ఇంటి పరిస్థితులు నువ్వు చూస్తున్నావు కదా. ఈ బాధ్యతల బంధంలో నేను వివాహం చేసుకోదలుచు కోలేదు.''

ఉవ్వెత్తున ఎగసిన కోపాన్ని పళ్ళ బిగువున అణచుకుంది. ''ఈ మాట ఎలా చెప్ప గలుగుతున్నావు సంజూ? ఒకసారి నా ముఖం లోకి చూసి చెప్పు...ఊహ తెలిసినప్పటి నుండి అల్లుకొన్న బంధం అన్నావు. జీవితం చివరిక్షణం వరకు విడిపో దన్నావు. మరి....మరి ఇంత తేలిగ్గా ఎలా అనగలుగుతున్నావు?''

సంజీవరావు నిట్టూర్చాడు. అతని హృదయంలో ఆవేదనా తరంగాలు. ''కాలం అనుకూలిస్తే అదే జరిగేది. కాని నా జీవితం అనుకోని మలుపు తిరిగింది. ఈ బాటలో బాధ్యతలే తప్ప సుఖాల ప్రసక్తి లేదు.''

''నీ బాధ్యతల్ని నేనూ ఇష్టంగా పంచుకోగలను''

''అది నా కిష్టం లేదు రాజేశ్వరీ! ఈ పరిస్థితిలో వివాహం చేసుకొంటే నీకూ, వాళ్ళకూ కూడా సరియైన న్యాయం చేకూర్చ లేను. నా బరువును మరొకరి పైన మోపడం కూడా నా కిష్టం లేదు. దయచేసి జరిగినదంతా మరిచిపో.''

ఒక్కసారిగా పొంగిన కోపంతో- ''నువ్వింత స్వార్థపరుడి వనుకోలేదు. నీ వాళ్ళ కోసం న న్నింతగా దగా చేస్తా వనుకోలేదు. నువ్వు మోసగాడివి. వంచకుడివి'' అంటూ తిట్టింది. ఏడ్చింది-చివరకు కాళ్ళ మీద పడి బ్రతిమలాడు కొంది. మూడు ముళ్ళు వేసి నీ దాన్ని చేసుకో సంజూ! జీవితాంతం నీ అడుగుజాడలో నడుస్తూ, నీ ఇంట్లో వాళ్ళకి సేవలు చేస్తూ జీవిస్తాను. నాకున్న ఒకే ఒక కోరికను తీర్చలేవా?'' అంటూ.

''క్షమించు రాజేశ్వరీ! నీ జీవితం విరబూసిన మల్లె పందిరిలా ఉండాలన్నదే నా కోరిక. నిన్ను వివాహం చేసుకొని ముళ్ళ కిరీటం పెట్టడం నా కిష్టం లేదు....'' అంటూ ... వెళ్ళి పోయాడు అక్కడ నుండి.

ఆ తర్వాత సంజీవరావు ట్రాన్స్ఫర్ మీద దూరంగా వెళ్ళిపోవడం జరిగింది. రాజేశ్వరి వాళ్ళు కూడా కొన్నాళ్ళకు అక్కడ నుండి వెళ్ళిపోయారని మాత్రమే తెలుసు.

ఇరవై ఏళ్ళకి మళ్ళీ కలుసుకోబోతున్నారు.

మరొకరి ఇల్లాలుగా, తనకేమీ కాని పరాయి దానిలా రాబోతోంది. తమ మధ్య పూర్వపు స్నేహం తప్ప మరేమీ లేదేమో.

మరి తన కెందు కీ ఆలోచనలు? గతానికెప్పుడో తెరదించాడు. స్మృతులను మనసుపొరల్లో ఏ మూలకో విసిరేశాడు.

రాజేశ్వరిని ఒక స్నేహితురాలిగా ఆహ్వానించడం వరకే తన బాధ్యత.

ధన్ ధన్ మంటూ ప్లాట్ ఫారమ్ అదిరిపడేలా శబ్దం చేస్తూ వచ్చింది హౌరా ఎక్స్‌ప్రెస్.

క్షణంలో ప్లాట్‌ఫారమ్ అంతా జనం. ప్రతి పెట్టె పగిలిన చీమల పుట్టలా ఉంది.

'ఎక్కడ?....రాజేశ్వరి ఎక్కడ?

పరుగులాంటి నడకతో అటూ ఇటూ నడుస్తూ గాలిస్తున్నాడు మనిషి మనిషినీ పరకాయించి చూస్తున్నాడు. ఎగరొప్పుతూ వెనక్కీ ముందుకీ, ముందుకీ వెనక్కూ ఎన్నిసార్లు తిరిగాడో!

జనం పలచబడ్డారు కాని రాజేశ్వరి జాడలేదు.

రాజేశ్వరి రాలేదనుకొంటే ప్లాట్‌ఫార మంతా శూన్యంగా కనిపించింది. గుండెల్లో ఏదో దిగులు.

భుజం మీద ఎవరిదో చెయ్యి పడటంతో ఉలిక్కి పడ్డాడు. తలతిప్పుతూనే సంభ్రమంతో నిలబడిపోయాడు. వేల మెర్క్యురీ దీపా లొక్కసారి వెలిగినట్లు పరిసరాలన్నీ కాంతి పుంజాలు వెదజల్లినట్లయ్యాయి.

చెవుల్లో సప్త స్వరాల రాగాలాపన.

'రా.....జే......శ్వ.....రీ....ఈ !'

ఎదలో మువ్వల రవళి.

రాజేశ్వరి చిరునవ్వుతో ''తెగ వెతికేస్తున్నావు కాని నా పిలుపు మాత్రం వినిపించుకోలేదు. మొదటి పెట్టెలో ఎక్కాను. అదెక్కడో ప్లాట్‌ఫారమ్ చివరకు పోయి ఆగింది'' అంది

అతనికేదీ వినిపించటం లేదు. కళ్ళనిండా రాజేశ్వరి రూపమే.

అవే సోగ కళ్ళు...నొక్కుల జుట్టు....పల్చని వంపు తిరిగిన పెదవులు....కొద్దిగా ఒళ్ళు చేసింది తప్ప పెద్ద మార్పేమీ లేదు.

గ్లాసెస్ తీసి చేత్తోపట్టుకొని విరగబడినవ్వుతూంది.

అదే నవ్వు. తల కొంచెం వెనక్కు వాల్చి. ముత్యాలసరం లాంటి పలువరుస తళుక్కుమంటుంటే చెక్కిళ్ళపై నొక్కులు చిన్న బోతున్నాయి.

''ఏమి టా చూపు వెర్రి మాలోకంలా?'' నవ్వుతూ అంది.

ఒక్కసారిగా సిగ్గుపడిపోయాడు. ''బావున్నావా రాజేశ్వరీ?'' తడబడుతూ అడిగాడు.

"కనిపిస్తూనే ఉన్నానుగా? నువ్వేమిటి చాలా మారి పోయావు. అప్పుడే చెంపలు కూడా నెరిశాయి. అవును మరి బాధ్యతలేమో!" అంటూ నవ్వింది.

కూలి సామాన్లు తెస్తుంటే బయటకు నడిచారు.

ఒక్కదానివే వచ్చావేమిటి?

"ఇంకెవర్ని తోడు తీసుకు రమ్మంటావు?"

"అదే-మీ వారు, పిల్లలు...."

"వాళ్ళు రానుపొమ్మన్నారు."

సంజీవరావు హృదయం ముడుచుకు పోయినట్లయింది. భర్త, పిల్లలు, సంసారం-ఆ పరిధిలో ఇమిడిపోయిన రాజేశ్వరిని చూస్తుంటే తన పక్కనే నడుస్తున్నా మధ్య వేల మైళ్ళ దూరం ఉన్నట్లు కనిపించింది.

స్టేషన్ బయట కొచ్చే సరికి ఎవరో పెద్దాయన గబగబ ఎదురొచ్చి "ఏమ్మా రాజేశ్వరీ! నేను రావడం ఆలస్యమై పోయింది. నువ్వు ఇబ్బందేమీ పడలేదు కదా?" అంటూ ప్రశ్నించాడు.

"పరవాలేదు బాబాయి గారూ! సంజీవరావుగారు ఉన్నారు కదా? నా చిన్నప్పటి స్నేహితులు- ఇప్పుడిక్కడే రెవిన్యూ ఆఫీసులో పని చేస్తున్నారు" అంటూ పరిచయం చేసి "నాన్నగారి స్నేహితులు రమణమూర్తిగారని? ఆడ పిల్లలు లేని కారణంగా న న్నెప్పుడూ కూతురి లాగే చూసుకొంటారు." అంటూ పరిచయాలు పూర్తి చేసింది.

ముందు రమణమూర్తి గారు వాళ్ళింటికి వెళ్ళాలనడంతో అక్కడికి వెళ్ళారు.

రమణమూర్తిగారి భార్య ఎంతో సంతోషంతో ఎదు రొచ్చి రాజేశ్వరి చేతులు పట్టుకొని దగ్గరకు తీసుకొని ఆప్యాయంతో పలకరించింది. "ఎన్నాళ్ళయిందమ్మా నిన్ను చూసి? నువ్వు మా గురించి తలచుకొంటావో, లేదో కాని మేము ఎప్పుడూ నీ గురించే చెప్పుకొంటాం."

"మీ అభిమానాన్ని, అప్యాయతను నే నెలా మరచిపోగల నమ్మా?"

"ఇం కెన్నాళ్ళుంటావు తల్లీ పెళ్ళి చేసుకోకుండా? ఈ పాటికి నలుగురు పిల్లలతో నట్టిల్లు కళ కళ లాడేలా తిరిగే దానివి. పిల్లలు కూడా నీ కక్కర కొచ్చేవాళ్ళు."

తుళ్ళిపడ్డాడు సంజీవరావు. నివ్వెర పోతూ చూశాడు రాజేశ్వరిని.

ఎడమ కనుబొమ పైకి లేపి కొంటెగా నవ్వింది.

దోసెడు పున్నాగ పూలు మీద జల్లినట్లు! పారిజాత సౌరభాలు గుప్పుమన్నట్లు హృదయంలో ఏదో పులకింత. శరీరం పువ్వులా తేలుతున్నట్లు, ఒంట్లో అమృతధారలే ప్రవహిస్తు న్నట్లనిపించింది.

రమణమూర్తికి చెప్పి రాజేశ్వరితో ఇంటికి బయలుదేరాడు. దారిలో అడిగాడు "నేను విన్నది నిజమేనా రాజేశ్వరి?"

"ఏమిటది?"

"నువ్వింకా పెళ్ళి చేసుకో లేదన్నది."

"అనుమానమా?"

"కాదు. విభ్రాంతి. ఇప్పటి దాకా నువ్వెందుకు పెళ్ళి చేసుకో లేదు?"

రాజేశ్వరి నవ్వింది. "ఏముంది? నువ్వు నీ వాళ్ళ కోసం ప్రేమను త్యాగం చేశావు. కాని నేను ప్రేమ కోసమే జీవిస్తున్నాను. ప్రేమ కంటే మరేదీ నాకు ఎక్కువ కాదు."

సంజీవరావు కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. గొంతు కేదో అడ్డు పడినట్లు మాట రాలేదు.



ఎందుకో రాజేశ్వరి చేతుల్లో ముఖం దాచుకొని హృదయంలో గడ్డ కటిన ఆవేదన కరిగే వరకూ, మనసుతీరా ఏడవాలని ఉంది. అతి నిగ్రహం మీద తనని తాను కంట్రోలు చేసుకొన్నాడు.

ఇంటికి వెళ్ళేసరికి అందరూ ఎదురు చూస్తూ ఉన్నారు. సంజీవరావు తమ్ముళ్ళను, మరదళ్ళను, పిల్లలను పరిచయం చేశాడు.

"పెద్ద తమ్ముడు ఏసిటిఓగా, రెండో తమ్ముడు లెక్చరర్గా చేస్తున్నారు" అంటూ గర్వంగా చెబుతుంటే కనుబొమలు పైకి లేపి మెచ్చుకోలుగా చూసి నవ్వింది.

రఘురాం, మురారి లీలగా గుర్తున్న జ్ఞాపకాలను ఆమెతో కలిసి నెమరు వేసుకొన్నారు. లలిత, వాసంతి నవ్వుతూ పలకరించి కబుర్లు చెప్పారు.

ఇల్లంతా సందడిగా అనిపించింది.

సంజీవరావు ఎన్నడూ లేనంత ఉత్సాహంతో ఉన్నాడు. భోజనాలయ్యాక కొత్త ఇంటికి తీసుకెళ్ళి చూపించాడు.

"జీవితంలో స్వంత ఇల్లు కట్టుకోవాలన్న అపురూపమైన కోరిక కూడా తీరబోతోంది రాజేశ్వరీ! నా తమ్ముళ్ళు ఇల్లూ వాకిలీ లేని వాళ్ళుగా ఉండకూడదు. ఈ ఇంటితో నా బాధ్యతలన్నీ పూర్తిగా తీరినట్లే! అనుకున్న దాని కంటే ఎక్కువ సాధిచానేమో కూడా." కొంచెం గర్వంతో వెన్ను విరుచుకుంటూ అన్నాడు.

రాజేశ్వరి నవ్వింది. ఒంపు తిరిగిన ఆ పెదవుల చాటున ఏదో ఎగతాళి.

"బావుంది. నీ వాళ్ళ కోసం అన్నీ చేశావు. కానీ నీ కంటూ ఏ కోరికా లేదా?" సూటిగా అడిగింది.

ఉలికిపాటుతో చూశాడు. "నాకా? నా కేం కావాలి?"

"బాధ్యతల బరువులో కోరికలు అడుగున పడిపోవచ్చు. కాని అవి తీరాక అయినా నే నున్నాను అంటూ నిన్న ప్రశ్నించకపోవు. మనసు దాచుకొని మాట్లాడకు. అంతరాత్మను ప్రశ్నించుకో."

కొన్ని క్షణాలు నిశబ్దంగా గడిచాయి.

మనసులు మౌనంగా సంభాషించుకొన్నాయి. హృదయాలు పరామర్శించుకున్నాయి.

నిశ్శబ్దాన్ని చీల్చుతూ నెమ్మదిగా అంది. "నీ కోసం ఒక వ్యక్తి జీవిత కాలం వేచి ఉందన్న విషయం నీకు స్ఫురించదా సంజూ?"

ఎగుడు దిగుడుగా ఉన్న రాళ్ళ మధ్య నడుస్తున్న సంజీవరావు తూలిపడ బోతుంటే చేతిని ఆసరాగా ఇచ్చింది.

హృదయంలో ఏదో సంచలనం, సంభ్రమం, సందిగ్ధం ముప్పిరిగొనగా మనిషి ఉక్కిరి బిక్కి రవుతున్నాడు.

వణుకుతున్న స్వరంతో "ఏమంటున్నావు రాజేశ్వరీ?" అన్నాడు.

"నీతో కలసి జీవించాలని ఉంది సంజూ."

"ఈ వయసులో వివాహమా?"

"కేవలం శారీక సుఖాల కోసమే అయితే నీ వన్నది నిజమే. కాని నేను ఒకరి కొకరు తోడుగా జీవించడం గురించి చెబుతున్నాను. దానికి వయసుతో నిమిత్తం లేదు. పెళ్ళే అవసరం లేదు'! గుళ్ళో దండలు మార్చుకొన్నా చాలు. మాట కలసినా చాలు."

"నన్ను ఆలోచించు కోనీ రాజేశ్వరీ."

రాజేశ్వరి నవ్వింది.

"అలాగే. కాని జీవితం చివరి క్షణం వరకూ ఆలోచించకు."

సాయంత్రం రాజేశ్వరిని ఇంటి దగ్గర దింపి, వచ్చాడు.

ఆ రాత్రి ఎంతకీ నిద్ర పట్ట లేదు.

కళ్ళ నిండా రాజేశ్వరి రూపమే. తన కోసం సర్వస్వమూ త్యాగం చేసి ఎదురు చూస్తోంది.

తమ్ముళ్ళు, చెల్లెళ్ళు గురించి చింత లేదు. తన పెళ్ళి గురించి శత పోరిన తల్లి లేదిప్పుడు. తన జీవితం గురించి ఒక నిర్ణయం తీసుకోక తప్పదు. తన బ్రతుకులో రాజేశ్వరి అడుగు పెట్టడం కంటే తనకు కావలసిం దేముంది?

ఆ ఉదయం బహు సుందరంగా ఉంది. ఏ వేకువా ఇంతటి వెలుగు నివ్వ నట్లనిపించింది.

కాఫీ తాగుతూ తన నిర్ణయాన్ని తమ్ముళ్ళకు చెప్పాడు నెమ్మదిగా.

తెల్లబోయి చూశా రంతా. అందరి ముఖాల్లో ఏవో సందేహాలు.

"ఈ వయసులో పెళ్ళేమి టన్నయ్యా?" అంటూ డైనింగ్ టేబులు ముందు నుంచి చప్పున లేచిపోయాడు రఘురాం.

"అంతగా వివాహం చేసుకోవా లనుకొంటే అప్పుడే చేసుకోక సగం వయ సయిపోయాక ఇప్పుడు పెళ్ళేమిటి?" అన్నాడు మురారి ముఖం అదోలా పెట్టుకొని.

లలిత నెమ్మదిగా అంది. "ఈ సంవత్సరం కొత్త ఇంట్లో సుగంధ వివాహం చేయాలనుకొంటున్నాం. ఇప్పుడీ విషయం నలుగురికీ తెలిస్తే దానికి సంబంధాలు కూడా రావు. ఆలోచించండి."

"మీ రీ నిర్ణయం తీసుకొనే ముందు ఒకసారి ఈ ఇంటి పరువు ప్రతిష్ఠలను గురించి ఆలోచించవలసింది." సూటిగా అంది వాసంతి.

పిల్లలు విషయం అర్థం కాక అయోమయంగా చూస్తున్నారు.

సంజీవరావు తల తిరిగి నట్లయింది.

ఉవ్వెత్తున లేచిన ఆశలు, కోరికలు తీరం చేరకుండానే బండరాళ్ళను ఢీకొని తిరిగి నట్లనిపించింది.

తల వంచుకొని గబ గబ కడు తున్న ఇంటి వైపు నడిచాడు. మనసు మెలి పెట్టిన బాధ!

మేస్త్రీ ఎదురొస్తూ "దారిన పోయే వాళ్ళంతా ఇల్లు బ్రహ్మాండంగా కడుతున్నా రంటున్నా రండీ! అందుకే దిష్టి బొమ్మ పెట్టాలని తయారు చేస్తున్నాం. పాత చొక్కా ఒక టివ్వండి" అన్నాడు.

కూలీలు గడ్డితో వికృతమైన బొమ్మ చేస్తూ నవ్వుకొంటున్నారు. సంజీవరావు హృదయంలో నీరవ నిశ్శబ్ద వేదన.

పెదవుల పైన శుష్క హాసం మెదలగా- "నే నుండగా వేరే దిష్టి బొమ్మెందుకు? అవసరం లేదు" అన్నాడు. ★